క్లుప్తంగా

దోమల నివారణ మందు పిచికారీ



పెదపెంకిలో మందు స్ప్రే చేయిస్తున్న వైద్యాధికారి కిరణ్మయి, సిబ్బంది

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతి ఆధ్వర్యంలో దోమల నివారణ మందు శనివారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు మందు పిచికారీ చేశామని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలు సిద్ధం

● జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్‌పాల్

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల అవసరాల మేరకు విత్తనాలు సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని డోకిశీల ఆర్‌బీకే వద్ద రైతులకు శనివారం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతులకు వరి, రాగి పంటకు సంబంధించి 2,100 క్వింటాళ్ల విత్తనాలు అందించేలా నిర్ణయించామన్నారు. విత్తనాలు, ఎరువుల వినియోగంపై రైతులకు పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అశోక్ కుమార్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పది గ్రామాల్లో పోలీస్ పికెట్

సీతానగరం: పార్వతీపురం సర్కిల్ పరిధిలోని పది గ్రామాల్లో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేసినట్లు సీఐ కె.రవికుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ఉన్నతాధికారుల సూచనల మేరకు శాంతిభద్రతలు పరిరక్షణలో భాగంగా భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్ పోల్ వెలువడిన సందర్భంగా ప్రజలందరూ సమయమనం పాటించాలని కోరారు. పెదబోగిలి, వెన్నెలబుచ్చింపేట, బలిజిపేట, అజ్జాడ, చిలకలపల్లి, ఎంఆర్ నగర్, బందలుప్పి, వన్నాం, దళాయిపేట, మాదలింగి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్ ఈ నెల 5వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు.

విద్యాకానుకలు సిద్ధం



ఎంఆర్‌సీ కార్యాలయంలో విద్యాకానుక కిట్లు

సీతానగరం: మండలంలోని పాఠశాలలు పునఃప్రారంభించిన రోజే విద్యార్థులకు అందించేందుకు విద్యాకానుకలు సిద్ధంగా ఉన్నాయని ఎంఈఓ జి.సూరిదేముడు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విద్యాకానుక కిట్లు ఎంఆర్‌సీ కార్యాలయానికి చేరుకున్నాయని చెప్పారు. మండల పరిధిలోని పాఠశాలలకు కిట్లు పంపిణీ చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా మందిరంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ 22వ వార్షికోత్సవం, 18వ అఖండ సాయినామ సప్తాహం కార్యక్రమంలో భాగంగా జై గురుదత్త హోమం, లక్ష పుష్పార్చన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, క్షీరాభిషేకం చేపట్టారు. ఈ నెల 3వ తేదీన మహారుద్రాభిషేకం, 4, 5, 6వ తేదీల్లో ఆలయ వార్షికోత్సవ పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 6వ తేదీన ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పుష్పాలంకరణలో భీమలింగేశ్వరుడు



ప్రత్యేక పుష్పాలంకరణలో భీమలింగేశ్వరుడు

పాలకొండ రూరల్: స్థానిక జగన్నాథస్వామి ఆలయ సమీపంలో కొలువుదీరిన భీమలింగేశ్వరునికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

జై హనుమాన్...



సీతానగరం : ఆంజనేయస్వామి ఆలయంలో అన్నసంతర్పణ చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

హనుమంతుడు బలం, అసమానమైన భక్తి, నిస్వార్థమైన సేవకు ప్రతీక..అటువంటి ఆంజనేయ స్వామిని ఆరాదించిన వారికి సకల పాపాలు తొలగిపోయి విముక్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో వైశాఖమాస బహుళ శుద్ధ దశమిని పురస్కరించుకుని పట్టణాలు, గ్రామాల్లో హనుమత్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తమలపాకులు, సింధూరంతో అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



బలిజిపేట : పెదపెంకిలో పూజలు చేస్తున్న భక్తులు



సీతానగరం : మరిపివలసలో పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి



సీతానగరం : మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు



పార్వతీపురం టౌన్: వైకేఎం కాలనీలో సామూహిక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పార్వతీపురం టౌన్: ప్రసాద వితరణ కార్యక్రమం చేపడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

నిరాడంబరంగా రాజన్నదొర జన్మదినం



రాజన్నదొరకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అభిమానులు

సాలూరు: ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పుట్టినరోజు వేడుకలు శనివారం నిరాడంబరంగా జరిగాయి. పట్టణంలోని మంత్రి స్వగృహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో చేరుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. భార్య రోజమ్మతో కలిసి రాజన్నదొర కేక్ కట్ చేసి అందిరికీ పంచి పెట్టారు. అనంతరం రామాకాలనీలోని అభయాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.



సాలూరు: రామాకాలనీలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటి సీఎం పీడిక రాజన్నదొర, తదితరులు

అలజంగికి పుట్టినరోజు శుభాకాంక్షలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

పార్వతీపురం టౌన్: ఎమ్మెల్యే అలజంగి జోగారావు పుట్టినరోజులు అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.
అలాగే మండల, పట్టణ నాయకుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా ఆస్పత్రిలోని రోగులకు రొట్టెలు, పండ్లు అందజేశారు. పట్టణ నాయకుడు చైర్మన్ బోను గౌరీశ్వరీ, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, మంత్రి రవి ఆధ్వర్యంలో ఆశాజ్యోతి ఆశ్రమంలో చిన్నారులకు.. ఏరియా ఆస్పత్రిలో సిబ్బందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మూడు మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణ సక్రమంగా ఉండాలి

భామిని: పారిశ్రామికంగా బయటకు వచ్చిన వ్యర్థాలను సక్రమంగా నిర్వహించి సద్వినియోగం చేసుకోవాలని, పర్యావరణానికి నష్టం కలగకుండా చూడాలని పాత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కె.రాణి సూచించారు. మండలంలోని బిల్లుమడలో జీడిపప్పు తయారీ కర్మాగారం వద్ద శనివారం నిర్వహించిన న్యాయసేవా సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రజలందరికీ సమన్యాయం అందించడానికి న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందన్నారు. కర్మాగారంలో పనిచేసే కూలీల వేతనాలై యాజమాన్యానికి సూచనలు చేశారు. భ్రూణ హత్యలకు పాల్పడొద్దని, పుట్టబోయే బిడ్డ ఆడ లేదా మగ అని తెలుసుకోవడం నేరమన్నారు. న్యాయ సేవాధికార సంస్థ సేవలను వినియోగించుకోవాలన్నారు.



న్యాయమూర్తిని సన్మానిస్తున్న మహిళా పోలీసులు

అనంతరం జూనియర్ సివిల్ జడ్జిని మండల మహిళా పోలీసులు ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు, బత్తిలి ఎస్ఐ సీహెచ్ ప్రసాద్, న్యాయవాదులు రవికిరణ్, ధర్మారావు, ఫాల్గుణరావు, సుధాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

బుక్స్ స్టాక్ పాయింట్ పరిశీలన



ఏపీ మోడల్ స్కూల్‌కు చేరుకున్న పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈఓ పగడాలమ్మ

కురుపాం: మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఉన్న బుక్స్ స్టాక్ పాయింట్‌ను డీఈఓ పగడాలమ్మ శనివారం పరిశీలించారు. ఇప్పటి వరకు ఏయే తరగతుల పుస్తకాలు ఎన్ని వచ్చాయి.. ఏయే తరగతుల పుస్తకాలు ఇంకా రావాల్సి ఉందన్న విషయాలపై సిబ్బందిని ఆమె ఆరాతీశారు. తొలి దశలో 1, 2, 8వ తరగతుల పుస్తకాలు వచ్చాయని, ఈ నెల 5వ తేదీ నాటికి అన్ని తరగతుల పుస్తకాలు వస్తాయని సిబ్బంది తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం రోజే అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు పుస్తకాల పంపిణీ జరగాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.
అనంతరం ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఇంగ్లిష్ ఉపాధ్యాయుల మధ్య నెలకొన్న వివాదంపై ప్రిన్సిపాల్ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. పాఠశాల సక్రమ నిర్వహణకు అందరూ సమన్వయంతో వ్యవహరించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

గరుగుబిల్లి: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు హెచ్చరించారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో శనివారం పర్యటించిన ఆయన అక్కడి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. అనంతరం ఎన్నికల నిబంధనలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదలైన నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని గ్రామపెద్దలకు సూచించారు. ఏ పార్టీ గెలిచినా ఓడిన పార్టీని ఉద్దేశించి, వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవద్దని, తగాదాలు ఆడవద్దని తెలిపారు. ఎన్నికల ఫలితాల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఏ ఒక్కచోట నలుగురు, ఐదుగురు గుమికూడి ఉండవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.అమ్మనరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు ఎన్నికల నిబంధనలు వివరిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

పాలకొండ రూరల్: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ సూచించారు. మండలంలోని వెలగవాడ, కన్నవరం, అంపిలి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రణాళికతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. వెలగవాడలో వీధి కాలువల్లో పూడిక తీతలను పర్యవేక్షించారు. దోమలు విజృంభించకుండా కాలువల్లో, మురుగునీరు నిల్వవున్న ప్రాంతాల్లో మలాథియన్ మందును స్ప్రే చేయించాలన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణ, తదితరులున్నారు.



వెలగవాడలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ

చిత్రలేఖనంలో మెలకువలు

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు ఆయిల్ పెయింటింగ్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఆయిల్ పెయింట్స్ ఉపయోగించి బొమ్మలు ఎలా వేయాలో డ్రాయింగ్ టీచర్ జి.మురళి విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ అధికారి గణేష్‌బాబు నేతృత్వంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కె.జనార్దనరావు తెలుగు పద్యాలు, వాటి తాత్పర్యాలను విద్యార్థులకు వివరించారు.

విద్యాకానుకల పరిశీలన

భామిని: మండలంలోని భామిని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విద్యాకానుకల స్టాక్ పాయింట్‌ను డీఈఓ జి.పగడాలమ్మ శనివారం పరిశీలించారు. ఇప్పటి వరకు వచ్చిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను పాఠశాలల వారీగా సిబ్బంది అమర్చడంతో వారిని అభినందించారు. సకాలంలో విద్యాకానుక కిట్లు విద్యార్థులకు చేరేలా చూడాలన్నారు. ఆమె వెంట సీఆర్పీ చిన్నబాబు, ప్రసాద్, సంజీవ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తిచేయాలి: ఆర్వో



కౌంటింగ్‌పై సూచనలు చేస్తున్న ఆర్వో

పాలకొండ: ఈ నెల 4న నిర్వహించనున్న ఎన్నికల కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సీతంపేట ఐటీడీఏ పీఓ శుభం బన్సల్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కౌంటింగ్ ఏర్పాట్లపై శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాస్ లు సిద్ధం చేయాలని తహసీల్దార్ వరహాలుకు ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాలకు ముందు రోజే చేరుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల నాయకులకు తగిన అవగాహన కల్పించాలన్నారు. ఏంజెట్లకు కౌంటింగ్ సమయంలో పాటించాల్సిన నిబంధనలు వివరించాలని సూచించారు.

‘ప్రిజం’ను సమర్థవంతంగా అమలు చేయాలి

పాలకొండ రూరల్: గ్రామస్థాయిలో గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రిజం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఎం.సింగిపురం, అన్నవరం పీహెచ్‌సీల వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పంచాయతీల వారీగా గర్భిణులు, బాలింతల వివరాలు, వారి తాజా ఆరోగ్య స్థితిగతులపై సమీక్షించారు. సుఖప్రసవం జరిగేందుకు, రక్తహీనతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు విజృంభించకుండా వైద్యసిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించా రు. సమావేశంలో వైద్యాధికారులు శివశంకర్, కమ లనాథ్, రవికుమార్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ రత్నకుమారి, పక్కన ఏఓ సౌజన్య

వీరఘట్టం: వ్యాపారులు తమ వద్దకు వచ్చే రైతుల కు నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పాలకొండ వ్యవసాయశాఖ ఏడీ రత్నకుమారి హెచ్చరించారు. వీరఘట్టం ఆర్‌బీకే వద్ద శనివారం ఎరువుల దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. లైసెన్సు లేకపోయినా, అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు కచ్చితంగా రశీదు ఇవ్వాలని, దానిపై డీలరు సంతకంతో పాటు రైతు సంతకం కూడా తీసుకోవాలని సూచించారు. ప్రతీ దుకాణం వద్ద ధరల పట్టికలు ఏర్పాటు చేయాలన్నారు. ఆమెతో పాటు వీరఘట్టం వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య ఉన్నారు.

ఉచిత విద్యుత్ మీటర్లపై సీఎండీ ఆరా

సీతంపేట: గతంలో పీవీటీజీ (పర్టికులర్లీ వలనర్‌బుల్ ట్రైబ్ గ్రూప్) గ్రామాల్లో గిరిజనులకు ఉచితంగా సరఫరా చేసిన విద్యుత్ మీటర్లు ఎంత వరకు వినియోగంలో ఉన్నాయనేదానిపై ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మాది శనివారం పరిశీలించారు. మండలంలోని డి.లక్కాయిగూడ గ్రామంలో పర్యటించి యేఏ ఇంళ్లకు మీటర్లు ఇచ్చారు, వాటి పనితీరును పరిశీలించారు. అంతకముందు స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సీజన్‌లో విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. లైన్‌లన్నీ సరిచేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకం ఉండకూడదన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సూర్యప్రకాష్, ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రం, ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి, డీఈ గోపాలకృష్ణ, ఏఈ నీలమ, తదితరులు పాల్గొన్నారు.



డి.లక్కాయిగూడలో విద్యుత్ మీటర్లను పరిశీలిస్తున్న సీఎండీ పృథ్వితేజ్

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు



డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ: ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంలో ఎవరైన సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కృష్ణారావు అన్నారు. వాట్స్‌యాప్ ద్వారా పెట్టే పోస్టులకు గ్రూప్ అడ్మిన్‌లదే బాధ్యత అని స్పష్టం చేశారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎన్నికల ఫలితాల సందర్భంగా ర్యాలీలు నిర్వహించినా, బాణ సంచా కాల్చినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని, నిబంధనలు ఎవరు అతిక్ర మించిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టవద్దు

జియ్యమ్మవలస: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టవద్దని, ఎవరైనా వివాదాస్పద పోస్టింగ్‌లు చేసి, తగాదాలకు తెరలేపితే అడ్మిన్‌లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని చినమేరంగి ఎస్ఐ చిన్నంనాయుడు తెలిపారు. ఇదే విషయమై శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయని, ఆ ఫలితాల విడుదలకు ముందు, విడుదలైన తర్వాత ఎవరూ ఎటువంటి గొడవలకు పాల్పడవద్దన్నారు. ఎవరు గెలిచినా ఒకేరకంగా వ్యవహరించాలని, ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు.